ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 18, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 31, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 27, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటి కాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న విజయ్ కిశోర్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడిగా గొర్ల విజయ్ కిశోర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోయిని వెంకటేశ్ యాదవ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ కిశోర్ యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని యాదవులను సంఘటితం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా నిరుపేద యాదవుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం : యువతి ఫిర్యాదు

సనత్‌నగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ యువతి ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం ..ఎస్సార్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న యువతి (26)కి ఒంగోలు జిల్లా రాజంపల్లికి చెందిన మురళి సోషల్ మీడియా వేదికగా పరిచయమయ్యాడు. మురళి ఎస్సార్‌నగర్‌లో ఉంటూ ఓ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు. ఇరువురి మధ్య స్నేహం పెరిగింది. ఈ క్రమంలో యువతిని పెళ్లి చేసుకుంటానని మురళి నమ్మించాడు. పలుమార్లు మురళి ఆమెతో శారీరికంగా కలిశాడు. అయితే కొన్ని రోజుల తర్వాత తనను పెళ్లి చేసుకోమని మురళిని ఆ యువతి కోరగా, తనకు ఇష్టం లేదనడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బౌద్ధనగర్: అనారోగ్యంతో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మధురానగర్‌లోని ఎస్‌ఆర్ హాస్పిటల్ సమీపంలో శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో సుమారు 45 వయస్సున ఓ గుర్తు తెలియని పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు ఓ వృద్ధురాలిపైకి కారు ఎక్కడంతో మృతి చెందిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్‌లోని బండ్లగూడ ప్రాంతానికి చెందిన మహేందర్ రెడ్డి శనివారం తన కుటుంబంతో కలిసి పద్మారావునగర్‌లోని స్కందగిరి ఆలయానికి వచ్చారు. తన కారును స్థానికంగా ఉన్న ఓ చెట్టు కింద పార్క్ చేసి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో మహేందర్ రెడ్డి తన కారును తీశాడు. అయితే.. కారు పార్క్ చేసిన సమీపంలోనే ఓ యాచకురాలు కూర్చొని ఉంది. మహేందర్ రెడ్డి కారు ముందు కూర్చున్న ఆమెను గమనించకుండా కారు తీయగా వృద్ధురాలిపైకి ఎక్కింది. ఇది చూసిన కొందరు కేకలు వేయడంతో కారును ఆపాడు. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు

వెంగళరావునగర్: మహిళను వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం మంచిర్యాల ప్రాంతానికి చెందిన యువతికి 2019లో అదే ప్రాంతానికి చెందిన దారంగుల వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇరువురు ప్రేమించుకున్నారు. వివాహం చేసుకోవాలని అనుకున్నారు. అయితే ఆమె తల్లిదండ్రులు వారి వివాహానికి అంగీకరించలేదు. దాంతో ఆమెకు వేరే వ్యక్తితో వివాహమైంది. ఆమెకు ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల భర్తతో మనస్పర్థలు రావడంతో విడాకుల కోసం ప్రయత్నిస్తోంది. ఈ మేరకు నగరానికి వచ్చి రహమత్‌నగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఇటీవల వెంకటేష్ ఆమెను కలిసి తరచూ వేధిస్తున్నాడు. తనకు ఇష్టం లేదని చెప్పినా ప్రేమించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దాంతో అతడిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బౌద్ధనగర్‌లో క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు



చీర సుచిత్ర ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పవన్‌ఖేరా, కోట నీలిమ, విశాల్ సూదం

ఉగ్రవాదాన్ని తరిమికొడదాం

సనత్‌నగర్: పహల్గాం ఉగ్రదాడిపై యావత్ జాతి ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. పలు రూపాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తూ తమ గళాన్ని వినిపిస్తున్నారు. పహల్గాం ఘటనకు నిరసనగా ర్యాలీలు, ధర్నాలు కొనసాగిస్తున్నారు.శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బేగంపేటలో నిర్వహించిన క్యాండిల్ లైట్ మార్చ్‌లో ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా, టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, సీనియర్ నేత విశాల్ సూదం పాల్గొని ఉగ్రదాడిని ఖండించారు. ఇలాంటి దాడులు భవిష్యత్తులో జరక్కుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోడల్‌కాలనీలో..

ఉగ్రదాడికి నిరసనగా మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీలు, కుల, మతాలు, ప్రాంతాలకతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉగ్రవాదాన్ని తరిమి కొట్టాలంటూ నినాదాలు చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది.



సీతాఫల్‌మండిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఎంజీరోడ్డులో..

రాంగోపాల్‌పేట్: ఉగ్ర దాడికి నిరసనగా సికింద్రాబాద్ ఎంజీరోడ్డులో కార్పొరేటర్ చీర సుచిత్ర ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంజీరోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి మహంకాళి దేవాలయం, పార్యడైజ్ సర్కిల్ తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రాణిగంజ్‌లోని ఐరన్ స్టీల్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంజు థియేటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ జలంధర్‌గౌడ్, శ్రవణ్, శివ రతన్, హరికుమార్, పూర్ణ చందర్ పాల్గొన్నారు.

వివిధ పార్టీల ఆధ్వర్యంలో..

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లోని వివిధ పార్టీల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ న్యూ అశోక్‌నగర్ నుంచి పార్శిగుట్ట చౌరస్తాలోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు ర్యాలీగా వెళ్లారు. దప్పు మల్లికార్జున్, పిట్టల ఓం ప్రకాష్ ముదిరాజ్, రసమల్ల బాబీ, కోట్ల నిరంజన్ రెడ్డి, రఘు, తుమ్మల శివప్రసాద్, దప్పు మహేష్, వెంకటేష్, లడ్డు, అశోక్, ఎడ్ల రుద్ర, మణికంఠ ముదిరాజ్ పాల్గొన్నారు.

హనుమాన్ భక్తి సేవా సమితి ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట: జమ్మూ కశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ అడ్డగుట్ట హనుమాన్ భక్తి సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చంద్రయ్య హోటల్ నుంచి తుకారాంగేట్ సుభాష్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సంతాపం తెలిపారు. పహల్గామా పర్యాటకులను చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సీతాఫల్‌మండీలో..

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల పట్ల సంతాపం తెలుపుతూ శనివారం సీతాఫల్‌మండీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పద్మారావు గౌడ్ మాట్లాడతూ.. ఉగ్రవాదుల దాడులను ఖండించి వారికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, కంది శైలజ, రాసూరి సునీత పాల్గొన్నారు.



మృతుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



అడ్డగుట్టలోని సీపీఎం కార్యాలయం వద్ద..



ఐరన్ అండ్ స్టీల్ ఆధ్వర్యంలో రాణిగంజ్‌లో..



మంజు థియేటర్ వద్ద మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సిబ్బంది

అమీర్‌పేట: పోలీసులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి సీఈఓ డా.దేవానంద్ అన్నారు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ..విధి నిర్వహణలో ఉంటూ ఒత్తిళ్ల కారణంగా కనీసం వ్యాయామం చేసే తీరిక కూడా చాలా మందికి ఉండటం లేదని కనీసం సంవత్సరంలో ఒక్క సారైన తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ శిబిరంలో ఏసీపీ బాలగంగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్సైలు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంస్కృత భాషను వ్యతిరేకించడం సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: సంస్కృత భాషను వ్యతిరేకించడం సరికాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం ఓయూలో సంస్కృత భాషా గురు శిష్య సంఘం ఆధ్వర్యంలో సంస్కృత శంఖారావం-భవిష్యత్తు తరాల కోసం సంస్కృత భాషా పరిరక్షణ అంశం పై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం అధ్యక్షులు డా.రాజేంద్రప్రసాద్, విద్యార్థి సంఘం అధ్యక్షులు నటరాజ్ మాట్లాడుతూ.. సంస్కృతం విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవీయ గుణాలను నాటుతుందన్నారు. ఇతర భాషలను అభ్యసించడంలో లేని అభ్యంతరం సంస్కృత భాషకు ఎందుకని ప్రశ్నించారు. నేడు (27న) తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు మద్దతుగా తెలంగాణ సంస్కృతిక శంఖారావం అనే ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో భాషను పరిరక్షించుకోవాలని సంస్కృత అకాడమీ డైరెక్టర్ డా.పెన్నా మధుసూదన్ పేర్కొన్నారు.

ఘనంగా ఓయూ ఆవిర్భావ వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 108వ ఆవిర్భావ వేడుకలను శనివారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ప్రొ.కొదండ రామ్, సీపీ ఆనంద్, ఐఏఎస్ అధికారి, కమిషనర్ కాలేజియేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ శ్రీదేవసేన, కవి అందేశ్రీ, నిజాం మనుమడు నవాబ్ మీర్ నజాఫ్ అలీఖాన్ పాల్గొని ఓయూ కీర్తిప్రతిష్ట గురించి మాట్లాడారు.



నడి రోడ్డులో మద్యం తాగుతూ హంగామా

దారి ఇవ్వమన్నందుకు ద్విచక్ర వాహనదారుడిపై దాడి

సనత్‌నగర్: నడిరోడ్డులో కారుఆపి మద్యం తాగడమే కాక దారి ఇవ్వమని అడిగినందుకు ద్విచక్ర వాహనదారుడిపై నలుగురు దాడి చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..సనత్‌నగర్‌కు చెందిన అక్రమ్ ఉల్లాఖాన్ (30) కారు డ్రైవర్. ఈ నెల 23న రాత్రి 11.20 సమయంలో సనత్‌నగర్ నుంచి తన హోండా యాక్టివా బైక్‌పై ఎర్రగడ్డకు వెళ్తున్నాడు. అదే సమయంలో మార్గమధ్యలో నీలిమా ఆస్పత్రి సమీపంలో నలుగురు వ్యక్తులు రోడ్డు మధ్యలో కారు ఆపి డోర్లు తెరిచి మద్యం తాగుతున్నారు. దారికి అడ్డంగా ఉన్న వీరిని అక్రమ్ ఉల్లాఖాన్ తనకు దారి ఇవ్వాలని కోరగా అతనితో గొడవపడి తీవ్రంగా కొట్టారు. అక్రమ్ ఉల్లాఖాన్‌పై బీరు పోసి పైశాచిక ఆనందం పొందారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నా కుమారుడి మృతిపై విచారణ జరిపించండి

- సెల్‌ఫోన్‌తో బ్యాంకు లావాదేవీలతో దుర్వినియోగం చేస్తున్నారు
- మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో మృతుడి తల్లి ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన తన కుమారుడి మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయని దీనిపై దర్యాప్తు చేయాలని మృతుడి తల్లి మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు చనిపోయిన రోజే కంపెనీలో భాగస్వామిగా ఉన్న ఓ యువతి బలవంతంగా కుమారుడి సెల్‌ఫోన్ లాక్కుని అక్రమ లావాదేవీలు జరుపుతుందని మృతుడి తల్లి ముక్తేశ్వరియాదవ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. 2024 నవంబర్ 15న బొల్లారం రిసాలాబజార్‌కు చెందిన ముక్తేశ్వరి యాదవ్ పెద్ద కుమారుడు మల్లికార్జున్ యాదవ్(25) ప్యారడైజ్ సీటీవోపై జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడ్డారు. వెంటనే అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించగా మరుసటి రోజు మరణించగా కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేశారు. అదే రోజు ఉదయం మెఘా ఇంజినీరింగ్ కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేసే రవిరెడ్డి కుమార్తె మేధారెడ్డి, మల్లికార్జున్ యాదవ్ తమ్ముడైన వినాయక్ యాదవ్ వద్ద ఉండే సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కుని వెళ్లింది. ఆ తర్వాత అనేక మార్లు ముక్తేశ్వరితో పాటు కుటుంబ సభ్యులు సెల్‌ఫోన్ కోసం మేధారెడ్డికి, ఆమె తండ్రి రవిరెడ్డికి ఫోన్ చేసినా ఎలాంటి స్పందన లేదు. యాక్సిడెంట్ క్లెయిమ్ కోసం, బ్యాంకు వివరాలు అన్ని ఫోన్ ద్వారా ఈ మెయిల్‌కు లింకు ఉండటంతో పలుమార్లు ఫోన్ కోసం సంప్రదించారు. అయితే అప్పట్లోనే మేధారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఆమె చిన్ననాటి స్నేహితుడు సాయి పవన్ కలిసి టింబర్ ఫోర్జ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రారంభించారు. వ్యాపారంలో ఎక్కువ లాభాలు వస్తాయని మోసపూరిత వాగ్దానాలు చేసి కంపెనీ స్థాపించారని తెలిపారు. అయితే ఈ ఫోన్ ద్వారా ఎలాంటి లీగల్, అధికారిక అనుమతులు లేకుండానే లావాదేవీలు జరుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే మెఘా కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న రవిరెడ్డి భువనేశ్వర్‌లో ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడని అందులో మల్లికార్జున్ యాదవ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చూపిస్తుండటం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనం నడిపిన ప్రకాష్, ప్రమాదానికి కారణమైన వాహన యజమానులు విగ్నేష్, నిమ్రిత్‌ల, సాయి పవన్‌లపై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. వాహనం నడిపిన వ్యక్తికి ఎలాంటి దెబ్బలు తగులకపోగా మల్లికార్జున్ యాదవ్‌కు తీవ్ర గాయాలపాలై మరణించడం, అటు తర్వాత జరుగుతున్న పరిణామాలతో తమ కుమారుడి మరణంపై లోతైన దర్యాప్తు జరిపించాలని సూచించారు. అయితే దీనిపై మొదట బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్థానిక ఏసీపీ కేసు దర్యాప్తు సరిగా చేయలేదనే ఆరోపణలతో ఈ నెల 23న మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

విజయ బ్రాండ్ పేరుతో నకిలీ పాల ప్యాకెట్లను విక్రయిస్తే చర్యలు తప్పవు



పాల ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న గుత్త అమిత్‌రెడ్డి

లాలాపేట: నకిలీ పాల ప్యాకెట్లను విక్రయిస్తున్న వీఎస్‌ఆర్ డెయిరీపై చర్యలు తీసుకున్నామని విజయ డెయిరీ చైర్మెన్ గుత్త అమిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తిరుమలగిరి వద్ద వీఎస్‌ఆర్ డెయిరీ వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో విజయ డెయిరీ పేరున నకిలీ పాలు, పాల ఉత్పత్తులను గుర్తించారు. వెంటనే నల్గొండ జిల్లా కేతెపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొండల్‌రెడ్డి సహకారంతో వీఎస్‌ఆర్ డెయిరీని సందర్శించారు. అక్కడ లభించిన 67 రోల్స్ నకిలీ విజయ పాల ప్యాకింగ్ ఫిలింను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గుత్త అమిత్ రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యతకు మారు పేరైన 'విజయ తెలంగాణ 'పేరు చూసి మాత్రమే పాలు పాల పదార్థాలను కొనుగోలు చేయాలనీ నకిలి విజయ బ్రాండ్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యపై సీఎం స్పందించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న అన్నారు. ఓయూ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మెకు శనివారం మల్లన్న మద్దతు తెలిపి మాట్లాడారు. ఇదిలా ఉండగా సమ్మెలో భాగంగా అధ్యాపకులు వీసీ పాలన భవనం ఎదుట రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు.

రజతోత్సవ వేడుకలు చరిత్రాత్మకం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: రాష్ట్ర సాధన కోసం పుట్టిన ప్రాంతీయ పార్టీ 25 వసంతాల వేడుకలను జరుపుకోవడం చరిత్ర అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో శనివారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. 27న ఉదయం 10 గంటలకు డివిజన్లలో పార్టీ జెండాలు ఎగురవేసి సభకు బయలుదేరాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చే వారి కోసం పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, ఎందుకు కాంగ్రెస్‌ను గెలిపించామా.. అని మథనపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ధ్వజమెత్తారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, కొలను బాల్‌రెడ్డి, పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, హన్మంతరావు, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌యాదవ్, నాగులు, ఏసూరి మహేష్, శ్రీహరి, నరేందర్‌రావు, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, కిషోర్, ఆంజనేయులు, శేఖర్, ఖలీల్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి..

అడ్డగుట్ట: బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న పార్టీలన్నీ వారి రాజకీయ, స్వప్రయోజనాల కోసమే ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ మాత్రం రాష్ట్ర సాధన కోసం పుట్టి తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాడిందని గుర్తు చేశారు.

'నాగులూరి'ని కలిసిన హమాల్‌బస్తీ నాయకులు



సాయిబాబాను కలిసిన హమాల్‌బస్తీ నాయకులు

పద్మారావునగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను హమాల్‌బస్తీలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ పారిశ్రామిక వేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా వెల్లడించారు. శనివారం బస్తీ కమిటీ నాయకులు సాయిబాబాను కలిసి విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించి విగ్రహాల ఏర్పాటుకు సమ్మతించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాగులూరి సాయిబాబా మాట్లాడుతూ.. పేద ప్రజల అభివృద్ధి వికాసానికి వారి పిల్లల విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. పేదలు విద్యా, సామాజిక, రాజకీయ, ఆర్థికపరంగా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు శివప్ప, సుభాష్, యాదగిరి, బస్వరాజ్, సంపత్, నర్సింగ్, రాజు, దేవేందర్, సత్యనారాయణ, దేవుడు, వెంకట్, అంజయ్య పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న పురాతన కట్టడాలు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో నిజాం కాలం నాటి పురాతన కట్టడాలు, కనుమరుగవుతున్నాయి. గత కొంత కాలంగా ప్రభుత్వాలు వాటిని పరిరక్షించడంలో పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు చరిత్ర సాక్ష్యాలను కనుమరుగు చేసే ప్రయత్నంలో ఉన్నారు. ఈ విధంగా ఇప్పటికే కొన్ని నిజాం హయాంలో నిర్మాణం చేసిన లాలాపేట కోటగోడ, బుర్జులు, పెద్ద దర్వాజలు శిథిలావస్థకు చేరడంతో కబ్జాదారులు వాటిని ఆక్రమించేశారు. ఇంకా కొన్ని ఉన్నాయి. అందులో లాలాపేట ప్రధాన రహదారి పక్కన పెద్ద దర్వాజకు ప్రస్తుతం ప్రమాదం పొంచి ఉంది. దానిపై ఏపుగా పెరిగిన చెట్లు కోట గోడను, దర్వాజను చీల్చివేస్తున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న ఓ భవన నిర్మాణదారుడు తన ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉందని పురాతన నిర్మాణాన్ని కూల్చివేస్తున్నట్లు సమాచారం.



లాలాపేటలో నిజాం కాలం నాటి పురాతన కట్టడం

ఆక్రమణ చెరలో పబ్లిక్ నల్లా షెడ్

లాలాపేట వాసులకు తాగునీటి కోసం గతంలోని ప్రభుత్వాలు పబ్లిక్ ట్యాప్, చేతి పంపును ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా ఓ షెడ్‌ను నిర్మాణం చేశారు. ఇక్కడి నుంచే అందరూ తాగునీటిని తీసుకెళ్లేవారు. కానీ ప్రస్తుతం ఇంటింటికి నల్లా రావడంతో దీని నిర్వహణను విస్మరించారు. నిరుపయోగంగా మారిన ఆ పాత కాలంలో ఉన్న పబ్లిక్ ట్యాప్, చేతి పంపు ఉన్న ప్రాంతం పక్కనే ఉన్న ఓ ఇంటి యజమాని ఆక్రమిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పురాతన నిర్మాణం(పెద్ద దర్వాజ)కు పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించి దానిని కూల్చివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని లాలాపేట వాసులు కోరుతున్నారు.



పబ్లిక్ నల్లా షెడ్‌ను ఆక్రమిస్తూ చేపడుతున్న మెట్ల నిర్మాణం